క్లుప్తంగా

మత్స్య సంపద పథకంపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం అమలుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్న లేవనెత్తారు. పథకం విశిష్ట లక్షణాలు, వినియోగించిన నిధులు, లబ్ధిదారులు, ఉత్పత్తి, ఎగుమతి, లక్ష్యసాధన, చేపల వ్యాపారుల మద్దతుకై ఉప పథకం అమలు తదితర అంశాలపై ఆయన వివరణ కోరారు. దీనికి కేంద్ర మత్స్య, పశు సంరక్షణ, పాడి పరిశ్రమ శాఖామంత్రి పర్షోత్తం రూపాల సమాధానం ఇచ్చారు. ఆత్మనిర్భర భారత్ పాకేజీ కింద రూ. 20500 కోట్ల పెట్టుబడితో 2020–21 నుంచి 2024–25 వరకు సాగే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని కేంద్రం ఆమోదించిందన్నారు. ఆధారిత, లబ్ధిలేని ఆధారిత అనే రెండు ప్రత్యేక భాగాలుగా ఉండే ఈ పథకం కింద చేపల ఉత్పత్తి– ఉత్పాదకత, సాంకేతికత, నాణ్యత, పంట అనంతర మౌలిక సదుపాయం– పంట అనంతర నిర్వహణ, మత్స్య నిర్వహణ–నియంత్రణ అనే మూడు విస్తృత భాగాల కింద రక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్పత్తి– ఉత్పాదకత, సాంకేతికత, నాణ్యత, పంట అనంతర మౌలిక సదుపాయం, నిర్వహణ, ఆధునికీకరణ, విలువల బలోపేతం, సామర్థ్య గుర్తింపు, మత్స్యకారుల సంక్షేమం తదితర విషయాలకు సంబంధించి క్లిష్టమైన అంతరాలు పరిష్కరించడం ఈ పథక విశిష్ట లక్షణాలన్నారు. దేశం మొత్తంలో మొత్తం ప్రాజెక్టు విలువ రూ. 12035 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో కేంద్ర వాటా రూ. 4536.37 కోట్లుగా ఉందని, ఇప్పటివరకు రూ. 2103.43 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ఏపీకి సంబంధించి మొత్తం ప్రాజెక్టు విలువ రూ. 2121–02 కోట్లుగా ఉందని, అందులో రూ. 544.88 కోట్లు, కేంద్ర వాటాకుగాను రూ. 186.59 కోట్లు విడుదల చేశారన్నారు. దేశం మొత్తంలో 10.21 లక్షల మంది లబ్ధి పొందారని, ఆంధ్రదేశ్‌కు సంబంధించి 1.21 లక్షలమంది ఉన్నారన్నారు. 2023–24 బడ్జెట్‌లో రూ. 6 వేలకోట్లతో నూతన ఉప పథకాన్ని కూడా కేంద్రం ఆమోదించిందని, దేశంలో 2021–22లో ఆల్‌టైం రికార్డుగా రూ. 162.48 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి జరిగి రూ. 57586 కోట్లు ఎగుమతి ఆదాయం వచ్చిందని కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల సమాధానం ఇచ్చారు.

కెరీర్ గైడెన్స్‌పై పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన

ఒంగోలు: కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్‌పై మంగళవారం స్థానిక డీఏ పాలిటెక్నిక్ ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు స్టెప్ అధికారులు అవగాహన కల్పించారు. తృతీయ సంవత్సరం విద్యార్థులకు పాలిటెక్నిక్ అనంతరం ఉజ్వల భవిష్యత్తుకు ఎలాంటి రంగాన్ని ఎంచుకోవాలి, ఉపాధి అవకాశాలతోపాటు ఉన్నత విద్యావకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్టెప్ కార్యాలయం మేనేజర్ పి.శ్రీమన్నారాయణ, ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ఏడుకొండలు, ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కోట్ల ఉపాధి పని దినాలు



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న పీడీ శీనారెడ్డి



నాగులుప్పలపాడు: కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న ఏపీఓ రవికుమార్

● ఉపాధి పనుల ద్వారా రూ.5.58 కోట్ల నిధులు చెల్లింపు

చీమకుర్తి: ఈ ఏడాది ఉపాధి కూలీలకు 2 కోట్ల పనిదినాలను కల్పించటం లక్ష్యంగా పెట్టుకున్నట్లు డ్వామా పీడీ కె.శీనారెడ్డి తెలిపారు. మంగళవారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి శీనారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల నుంచి ఉపాధి కూలీలకు రోజు వారీ వేతనం రూ.272కు పెంచుతున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలకు పనిదినాలను పెంచాలని స్థానిక ఉపాధి హామీ సిబ్బంది తెలిపారు. సంతనూతలపాడు మండలంలో 2021–22 సంవత్సరంలో 552 పనులకు సంబంధించి రూ.5.58 కోట్ల చెల్లింపులు చేసినట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎంపిక చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీపీ బి.విజయ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, ఎంపీడీఓ రాఘవేంద్ర, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల మస్టర్లు సక్రమంగా ఉండాలి

నాగులుప్పలపాడు: ప్రస్తుత సీజన్‌లో ఉపాధి పనులు చేసే కూలీల మస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని ఏపీఓ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఒమ్మెవరంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన కూలీలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ వేతనం తగ్గకుండా పనిచేసుకోవాలని సూచించారు. కూలీల వేతనాలు మరో వారం రోజుల్లో వారి ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. అనంతరం కూలీల మస్టర్ రోల్సు పరిశీలించారు. టీఏ పిచ్చయ్య, ఫీల్డు అసిస్టెంట్ నవీన్ తదితరులున్నారు.

ఉత్సాహంగా కోలాటం



నిర్మల్ నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రుల వేడుకల్లో కోలాటం ప్రదర్శన

ఒంగోలు టౌన్: శ్రీ సీతారామ స్వామి 30వ వసంత నవ రాత్రుల కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని స్థానిక నిర్మల్ నగర్‌లోని స్వామివారి దేవస్థానం వద్ద మంగళవారం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఉర్రూతలూగించింది. కొణిజేడుకు చెందిన కె.మాస్టర్ నేతృత్వంలోని చక్రధర స్వామి కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. నిర్మల్ నగర్ పరిసరవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ గౌరవాధ్యక్షులు తాటిపర్తి గోపాల్‌రెడ్డి, అధ్యక్షులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఉపాధ్యక్షులు ధూళిపాళ్ల లక్ష్మీనారాయణ, డాక్టర్ కంచర్ల సుబ్బారావు, కృష్ణవేణి, మాధవి పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం

అల్లూరు (కొత్తపట్నం): శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతాసమేత కోదండరామస్వామి దేవస్థానంలో ఈ నెల 30న సీతారాములవారికి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మిట్నసల రామకోటయ్య తెలిపారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధికంగా హాజరు కానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలుంటాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొగాకు చూర బయట విక్రయించవద్దు

మద్దిపాడు: పొగాకు రైతులు తమ వద్ద ఉన్న పొగాకు చూరను బయట అమ్మకూడదని వెల్లంపల్లి వేలం కేంద్రం ఆక్షన్ సూపరింటెండెంట్ ఎం. సత్య శ్రీనివాస్ తెలిపారు. చూరను వేలం కేంద్రంలో అమ్మడానికి ట్రయల్ రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ 1, శనివారం మొదటి విడతగా చంద్రపాడు, ముండ్లమూరు, కోరిశపాడు క్లస్టర్ల రైతులు తమ వద్ద ఉన్న చూరను బ్యారన్‌కు ఒక బేలు చొప్పున తెచ్చుకోవాలని తెలిపారు. బేలు యథావిధిగా 150 కేజీల్లోపు ఉండాలని తెలిపారు. పొగాకు బేలు పట్టల్లో మాత్రమే తీసుకరావాలని కోరారు. బయట అమ్మే రైతులపై చర్యలు తీసుకుంటుమన్నారు.

ఉచిత నిర్ధారణ శిబిరాలతో ఉపయోగం



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ఒంగోలు: జిల్లాలో నిర్వహిస్తున్న ఉచిత ఉపకరణాల కోసం ఏర్పాటు చేసిన ఉచిత నిర్ధారణ శిబిరాలు దివ్యాంగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, తద్వారా అర్హులైన వారికి ఉపకరణాలు ఉచితంగా అందజేయాలని సహిత విద్యావిభాగం ఇన్‌చార్జి జిల్లా కోఆర్డినేటర్ యం.రమేష్ అన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో సహిత విద్యా విభాగంచే స్థానిక డాన్‌బాస్కో ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన ఉచిత శిబిరానికి హాజరైన విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చెవి, కంటి, శారీరక, మానసిక విభాగాల్లో దివ్యాంగులను నిపుణులు పరీక్ష చేసి అర్హులైన వారిని ఎంపికచేసి వారికి అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అలెంకో, నిపిడ్ సంస్థలు ద్వారా ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు, సీపీ చైర్లు, క్రచెస్, హియరింగ్ ఎయిడ్స్, బోధనోపకరణాలు ఉచితంగా అందిస్తామన్నారు. మానసిక విభాగంలో సుస్మిత, చెవి విభాగంలో వెంకటేష్, కంటి విభాగంలో రాజా, శారీరక విభాగంలో సుధాకర్‌లు దివ్యాంగులను పరిశీలించి అవసరమైన ఉపకరణాలు సూచించారు. ఒంగోలు డివిజన్ నందలి మండలాల దివ్యాంగులు, తల్లిదండ్రులు, సహిత విద్య రీసోర్సు పర్సన్లు, స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక విద్య పాల్గొన్నారు. ఈ శిబిరం ద్వారా 4 విభాగాలకు చెందిన 130 మందిని ఉచిత ఉపకరణాలకు అర్హులుగా గుర్తించారు.

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి



శిక్షణ ఇస్తున్న డీఎల్‌పీవో పద్మ

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): చూడచక్కని గ్రామాలుగా తీర్చిదిద్దాలంటే చెత్త సంపద తయారీ కేంద్రాలను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని డీఎల్‌పీవో ఆర్. పద్మ అన్నారు. కె.పల్లెపాలెం చెత్త సంపద తయారీ కేంద్రంలో రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈతముక్కల, గుండమాల, మద్దిపాడు, రాచవారిపాలెం, పి.నాయుడుపాలెం పంచాయతీలకు చెందిన 40 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించి తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చడం, ప్లాస్టిక్ సామాన్యులను ప్రాసెస్ చేయటం, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈవోఆర్డీ ఏ.బాల చెన్నయ్య, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, కారాని జయరావు, జిల్లా రీసోర్స్ సిబ్బంది చక్రధరరావు, ఖాజావలి, పంచాయతీ కార్యదర్శి శ్యాంబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్బీజీ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు



ఎల్బీజీకి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: అట్టడుగు ప్రజల హక్కుల కోసం పోరాడిన ఎల్బీ గంగాధర్‌రావు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎల్బీ గంగాధర్‌రావు 20వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం సుందరయ్య భవన్‌లో మాట్లాడారు. ప్రజలకే భూమిపై సర్వాధికారాలు ఉండాలని అనేక పోరాటాలు నిర్వహించిన లావు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నల్లమల అడవుల్లో రహస్య జీవితాన్ని గడిపారని తెలిపారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదల భూమిని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని, దేశ ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బ తీస్తూ లౌకిక పునాదులను నాశనం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలను సమీకరించడం ద్వారా దేశ ప్రజల ఐక్యతను కాపాడుకునేందుకు ఉద్యమించాలని కోరారు. తొలుత లావు గంగాధర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షత వహించగా సయ్యద్ హనీఫ్, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, షేక్ మహబూబ్, ఎండీ రమేష్, డి.సోమయ్య, వెల్లంపల్లి ఆంజనేయులు, ఉసా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యరజర్లలో వైఎస్సార్ కంటి వెలుగు



నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

ఒంగోలు రూరల్: మానవుని అవయవాల్లో ముఖ్యమైన కళ్లను ఆరోగ్యకరంగా ఉంచుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రిమ్స్ నేత్ర డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం యరజర్ల సచివాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ లాంఛనంగా ప్రారంభించారు. కార్యదర్శి రామకృష్ణ కన్వీనర్‌గా వ్యవహరించిన కార్యక్రమంలో నేత్ర వైద్యులు మాట్లాడుతూ చిన్నారుల్లో దృష్టి లోపాలు పెరిగే కొద్దీ కొన్ని లోపాలు తగ్గిపోతాయని తగ్గని పక్షంలో తల్లిదండ్రులు సకాలంలో గుర్తించి వైద్యుల వద్దకు తీసుకెళ్లాలన్నారు. తదేకంగా సెల్‌ఫోన్ చూడడం, దగ్గర నుంచి టీవీని గంటల పాటు చూడటం చిన్నారుల్లో దృష్టి లోపానికి కారణమవుతోందన్నారు. 40 ఏళ్లు దాటిన తరువాత దృష్టి లోపం ఉన్నా లేకున్నా ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ రాధా పండేలా, వైస్ సర్పంచ్ హరి, ఆంజనేయులు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.200

పొదిలి: స్థానిక వేలం కేంద్రానికి రైతులు మంగళవారం 506 బేళ్లను తీసుకురాగా 460 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.200 కాగా, కనిష్ట ధర రూ.170 పలికిందని వేలం నిర్వహణాధికారి గిరిజాకుమర్ తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీన పొగాకు ముక్క, చూర కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. 150 కేజీలకు మించకుండా సాధారణ బేళ్ల మాదిరిగానే వేలానికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద ముందుగా వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

భూగర్భ జలాలు దుర్వినియోగం చేయవద్దు

మార్కాపురం: భూగర్భ జలాలను దుర్వినియోగం చేయవద్దని భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రైతులు, విద్యార్థులకు భూగర్భ జలాల వినియోగంపై అవగాహన కల్పించారు. విచ్చలవిడిగా డీప్ బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయాయన్నారు. ఈ నేపథ్యంలోనే వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వ్యవసాయశాఖ ఏడీ రమాదేవి, హార్టికల్చర్ ఏఓ రమేష్, మైక్రో ఇరిగేషన్ ఏపీఓ ఓబన్న, పెద్దారవీడు ఏఓ బుజ్జిబాయి, జియాలజిస్ట్ జీవన్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మందులు పంపిణీ చేస్తున్న బాపట్ల కళాశాల విద్యార్థులు

అల్లూరు (కొత్తపట్నం): గ్రామీణ ప్రాంత ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రవిబాబు అన్నారు. వ్యవసాయ కళాశాల బాపట్ల చివరి సంవత్సరం విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రవిబాబు మాట్లాడుతూ గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై వచ్చే వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా పెరుగుతున్నాయని, వడ గాలులు వీస్తున్నాయని తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. నీరు ఎక్కువగా తాగాలని, ఎండకు బయటకు రాకుండా చల్లటి వాతావరణంలో ప్రయాణం చేయాలని సూచించారు. డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉంటమే కాక వ్యాధులు దరి చేరవని సూచించారు. గ్రామంలో 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ బి.భారతి, ఏఎన్ఎంలు, ఆశవర్కులు, బాపట్ల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.